
అనంత యువత కరచాలనం


తాడిపత్రిలో జనసందోహం



సమర శంఖారావం

జగన్ అరాచకపాలనపై విమర్శనాస్త్రాలు

అనంతపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉమ్మడి జిల్లాలో చేపట్టిన మలి విడత శంఖారావం దిగ్విజయమైంది. 'అదిరిందన్నా.. లోకేశ్ అన్నా..' అని శ్రేణులు సంబరాల్లో మునిగితేలుతున్నాయి. యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది. సీఎం జగన్‌రెడ్డి అరాచకాన్ని దీటుగా ఎదుర్కొని, రాబోయే ఎన్నికల్లో విజయ ఢంకా మోగించడమే లక్ష్యంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావ సభలను నిర్వహించారు. టీడీపీకి కంచుకోట హిందూపురం నుంచి ప్రారంభమైన శంఖారావం.. మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం అర్బన్, తాడిపత్రి నియోజకవర్గాల్లో సాగింది. ఇదే సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఖరారవ్వడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. శంఖారావం వేదికగా పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేయడంతోపాటు బాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై శ్రేణులకు లోకేశ్ దిశానిర్దేశం చేశారు. అధికార పార్టీ తప్పుడు కేసులకు భయపడాల్సిన పనిలేదని, ఎన్నికల కదనరంగంలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. మరో రెండు నెలల్లో రాబోయే ప్రజా ప్రభుత్వంలో పార్టీ కేడర్‌ను వేధించిన ఏ ఒక్కరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు.


అనంత: నారా లోకేశ్‌తో విద్యార్థినులు


టీడీపీ నగర నేతలతో నారా లోకేశ్


అశ్మిత్‌రెడ్డికి సూపర్ సిక్స్ బ్యాగ్ అందజేస్తూ..

కరువు జిల్లాను ఆదుకున్నాం..

నారా, నందమూరి కుటుంబాలకు రాజకీయంగా పెద్ద పీట వేసిన ఈ జిల్లా అభివృద్ధికి ఎంత తోడ్పాటు అందించినా తక్కువేనని లోకేశ్ అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కరువు జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు చంద్రబాబునాయుడు అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయడంతోపాటు పంటనష్టపోయిన ప్రతి రైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకున్న ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. వైసీపీ అరాచక పాలనలో విసిగిపోయిన ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పడం తథ్యంగా కనిపిస్తోందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, కరువు రైతుకు ప్రతి ఎకరాకు సాగునీరు అందించి ఆదుకునే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని అన్నారు. తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ చార్జీలపెంపు, ఇంటి పన్ను, చెత్తపన్ను, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తు ధరలు పెంచి.. ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపిన సైకో జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని శంఖారావం సభల వేదికగా నారా లోకేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

- జిల్లా ఘనతను కీర్తిస్తూ ప్రసంగాలు
- నాటి అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తు చేసిన యువనేత
- వంద పథకాలను రద్దు చేసిన జగన్‌పై మాటల తూటాలు
- శ్రేణుల్లో జోష్ నింపుతూ.. కూటమి ఐక్యతను చాటిన లోకేశ్
- ఉమ్మడి అనంతలో మలివిడత శంఖారావం సూపర్ సక్సెస్





జిల్లా కీర్తిని గుర్తుచేస్తూ..

శంఖారావం సభల్లో నారా లోకేశ్ ప్రసంగం సరికొత్తగా సాగింది. పార్టీ శ్రేణులు, ప్రజలను ఆకట్టుకుంది. ప్రతి సభలోనూ యువతను ఆకట్టుకుంటూ మాట్లాడారు. 'అనంత యువత పవర్ అదిరిపోయింది' అంటూ ఉత్సాహాన్ని పెంచారు. ఉమ్మడి జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రాలు, దేవాలయాలను గుర్తు చేశారు. లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయం, ప్రశాంతి నిలయం, చెన్నకేశవ స్వామి దేవాలయం ఉన్న పుణ్యభూమి అనంత అంటూ జిల్లాను కీర్తించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని గుర్తు చేశారు. భారతదేశంలో ఎక్కడ కియ కారు కనబడినా అనంత పేరు మార్మోగుతోందని అన్నారు. కరువు జిల్లా ప్రజల దార్శనికత, దాతృత్వాన్ని గొప్పగా చెప్పుకొచ్చారు. ఈ జిల్లా ప్రజలకు ఎవరైనా న్యాయం చేస్తే గుండెల్లో పెట్టుకొని కాపాడతారని, అన్యాయం చేస్తే తోలుతీసే శక్తి ఇక్కడి ప్రజలకు ఉందని అన్నారు. కరువు ప్రజల ఆత్మాభిమానం గొప్పదనాన్ని నారాలోకేశ్ తన మాటల్లో చెప్పుకొచ్చారు. ఇక్కడి ప్రజలు మహా మొండి వారని, అనుకున్నది సాధించేంత వారు నిద్రపోరని, ఎదుటోడిని నిద్రపోనివ్వరని అన్నారు. ఇలాంటి పవిత్ర నేలపై పర్యటనకు వచ్చిన తనను అక్కున చేర్చుకోవడం తన అదృష్టమని అన్నారు.



ఉష్ణోగ్రతలు 10-3-2024
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 25.0



టీడీపీ హయాంలో పేదవాడి కడుపు నింపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు, పేదలు సంతోషంగా పండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతో పండుగలకు ఇచ్చే కానుకలను జగన్ రద్దు చేశారని లోకేశ్ అన్నారు. పెళ్లి కానుకలు, చంద్రన్న బీమా, రంజాన్ తోఫా, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య, ఆరు లక్షల మంది వృద్ధులకు ఇవ్వాల్సిన పింఛన్లు, రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీ.. ఇలా చెప్పుకుంటూపోతే 100 సంక్షేమ కార్యక్రమాలను కట్ చేసిన సైకో.. జగన్ అని విమర్శించారు. జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. అనేక ఆర్థిక నేరాల్లో ప్రిజనరీగా ఉన్న జగన్ కావాలో.. ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే చంద్రబాబు లాంటి విజనరీ కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ తేడాను గుర్తించి ప్రజలు రాబోవు ఎన్నికల్లో ఓటు ఆయుధంగా మలుచుకొని ప్రిజనరీని ఇంటికి పంపాలని కోరారు. సైనికుల్లా పనిచేసి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన శంఖారావం సభలకు జనం నీరాజనం పలికారు. భారీ కాన్వాయ్‌తో నారా లోకేశ్‌కు పార్టీ శ్రేణులు స్వాగతం పలికడం ఈ పర్యటనలో విశేషం.




కార్యకర్తల కోలాహలం


తాడిపత్రిలో వినతి పత్రం సమర్పిస్తున్న ముస్లింలు


తాడిపత్రి: ఉత్తమ కార్యకర్తలకు గుర్తింపు


అనంత సభకు హాజరైన జనం..

మహిళపై వైసీపీ వర్గీయుల దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు


మీడియాతో ఆవేదన వ్యక్తం చేస్తున్న లక్ష్మీదేవి

అనంతపురం క్రైం, మార్చి 11: తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయించలేదని ప్రశ్నించినందుకు అధికారపార్టీవారు తనపై దాడి చేశారని పార్వతమ్మ కాలనీకి చెందిన లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ఇంటింటికీ వైసీపీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్వతమ్మ కాలనీలో కార్పొరేటర్ కుమారుడు చింతకుంట మధు, ఎమ్మెల్యే అనంతను కొళాయిల విషయమై లక్ష్మీదేవి నిలదీశారు. మూడేళ్లకు కొళాయిలు లేవని, ఏడాది నుంచి నగరపాలిక కార్యాలయం, కార్పొరేటర్ చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే.. 'దాంతో ఏం.. రా..' అని పార్టీ నాయకులను పిలుచుకుని ముందుకు వెళ్లిపోయారని, మహిళల పట్ల అలా మాట్లాడటం ఏమిటని బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వెళ్లిపోయిన అనంతరం అధికార పార్టీకి చెందిన కొందరు తన ఇంట్లోకి దూరి దాడి చేశారని బాధితురాలు వాపోయారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములతో కలిసి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్య గురించి ఏడాది క్రితమే ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చామని, అయినా పట్టించుకోలేదని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల గురించి ప్రశ్నించేవారిపై దాడి చేయడం ఏమిటని మండిపడ్డారు. ఎమ్మెల్యే అనంత వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దాడి చేసినవారిపై పోలీసులు కేసు నమోదు చేయాలని, లేదంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పగిలిన గుండె

భర్త హత్యను జీర్ణించుకోలేని శోభ


భర్తతో శోభ (ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 11: ఎస్కేయూ గెస్ట్ లెక్చరర్ మూర్తిరావు హోకలే హత్యను జీర్ణించుకోలేక.. ఆయన భార్య గుండె పగిలింది. మూర్తిరావు మృతి చెందిన కొన్ని గంటలకే ఆయన అర్ధాంగి శోభ(56) గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. దీంతో వారి కుటుంబంలో అంతులేని విషాదం అలుముకుంది. జేఎన్‌టీయూ ఎదురుగా ఉన్న మూర్తిరావు హోకలే ఇంట్లోకి వెళ్లి ఆయన అల్లుడు ఆదిత్య ఆదివారం రాత్రి కత్తితో దాడి చేశారు. దీంతో మూర్తిరావు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రిలో భర్త మృతదేహం వద్ద విలపిస్తూ శోభ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు గుండెపోటు రావడంతో అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాసేపటికే ఆమె మృతి చెందారు. దంపతులిద్దరూ గంటల వ్యవధిలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగింది. వారి పిల్లలు రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడిపెట్టించింది. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పిన్నదరి జెడ్పీ హైస్కూల్‌లో శోభ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు ఉజ్వల్ హైదరాబాద్‌లో, కుమార్తె వైష్ణవి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

అదిగో నెలవంక..!

రంజాన్ మాసం ఆరంభం

నేటి నుంచి ఉపవాస దీక్షలు



అనంతపురం కల్చరల్, మార్చి 11: 'మానవ జీవితానికి సార్థకత చేకూర్చుకునేందుకు అల్లా ప్రసాదించిన అద్భుత అవకాశం రంజాన్ మాసం' అని ముస్లింలు విశ్వసిస్తారు. కోర్కెలను నియంత్రించుకుని, భగవంతునిపై మనస్సును లగ్నం చేసే మహత్తర దీక్ష.. రోజా ఈ పవిత్ర మాసంలో చేపడతారు. నియమ నిష్ఠలు, క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనల కలయిక రంజాన్ మాసం. సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో రంజాన్ నెల ఆరంభమైంది. జిల్లావ్యాప్తంగా మసీదుల వద్ద సోమవారం సాయంత్రం ప్రార్థనల అనంతరం నెలవంక దర్శనం కోసం ముస్లింలు ఆకాశం వైపు ఆసక్తిగా చూశారు. నెలవంక కనిపించగానే ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇస్లాం క్యాలెండర్ మేరకు తొమ్మిదో నెలలో వచ్చే రంజాన్.. ఆ సామాజికవర్గ ప్రజలకు అతిపెద్ద పండుగ. ఏడాదిలో మిగిలిన నెలలు ఎలా గడిపినా, రంజాన్ మాసంలో మాత్రం దైవచింతనతో గడపాలని మతగురువులు సూచిస్తారు. తమ తమ పనుల్లో నిమగ్నమవుతూనే, దైవ చింతనతో సాగాలని, ప్రాపంచిక విషయాలపై దృష్టి సారించకూడదన్నది రంజాన్ మాసంలోని నిబంధనల్లో ఒకటి. త్రికరణశుద్ధిగా, నిష్కల్మషంగా ఉండాలని, కలలోకూడా ఇతరులకు అపకారం తలపెట్టాలనే ఆలోచన చేయవద్దని సూచిస్తుంది. రంజాన్ నేపథ్యంలో మంగళవారం నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు ఆరంభించనున్నారు. ఉదయం, సాయంత్రం ఇఫ్తార్, సెహరీతోపాటు ప్రత్యేక దువా ప్రార్థనలతో మసీదులు సందడి సంతరించుకోనున్నాయి.



ఇఫ్తార్	: మంగళవారం సాయంత్రం 06:31
సెహరీ	: బుధవారం ఉదయం 05:12

భారీ మెజార్టీతో గెలిపించాలి

శింగనమల నాయకులతో నారా లోకేశ్

బుక్కరాయసముద్రం, మార్చి 11: టీడీపీ శింగనమల అభ్యర్థి బండారు శ్రావణీశ్రీని భారీ మెజార్టీతో గెలిపించాలని ద్విసభ్య కమిటీ సభ్యులకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచించారు. పీవీకేకే కళాశాల ప్రాంగణంలో పార్టీ నియోజకవర్గ నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో చిన్నచిన్న విభేదాలున్నా.. చక్కదిద్దాల్సిన బాధ్యత ద్విసభ్య కమిటీదే అని ఆయన అన్నారు. ఇక నుంచి ప్రజల మధ్యలోనే ఉండాలని నాయకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని, వారికి ఏ కష్టం వచ్చినా అభ్యర్థితో పాటు ద్విసభ్య కమిటీ సభ్యులు అండగా నిలవాలని అన్నారు. శింగనమల నియోజకవర్గంలో ఈ వారంలోనే శంఖారావం సభ నిర్వహిస్తానని, ప్రస్తుతానికి వాయిదా వేశామని తెలిపారు. సమావేశంలో పార్టీ అభ్యర్థి బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.


లోకేశ్‌తో శింగనమల నియోజకవర్గ నాయకులు

ప్రత్యేకంగా సమావేశం

అనంతపురం నుంచి తాడిపత్రికి వెళుతున్న సమయంలో ద్విసభ్య కమిటీ సభ్యులను లోకేశ్ తన వాహనంలోకి పిలిపించారు. పార్టీ పరిస్థితుల గురించి చర్చించారు. అసంతృప్తితో ఉన్న ముంటిమడుగు కేశవరెడ్డితో మాట్లాడి, పార్టీ గెలుపు కోసం గట్టిగా పనిచేయాలని సూచించారు. ఇద్దరికీ మంచి భవిష్యత్తును ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని లోకేశ్ తమకు భరోసా ఇచ్చారని ఆలం, కేశవరెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుపై వైసీపీ జెండా



ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ బస్సుపై వైసీపీ జెండా రెపరెపలాడుతూ కనిపించింది. ఉరవకొండ డిపో నుంచి మేదరమెట్ల సిద్ధం సభకు 15 ఆర్టీసీ బస్సులు వెళ్లొచ్చాయి. ఆ పని ముగిశాక.. బస్సుపై ఉన్న వైసీపీ జెండాను ఆర్టీసీ అధికారులు తొలగించకుండా.. అలాగే నడుపుతున్నారు. వైసీపీ జెండాలతో పలు బస్సులు ప్రయాణికులను ఎక్కించుకుని సోమవారం తిరిగాయి. ఆర్టీసీ బస్సుపై అధికార పార్టీ జెండాను చూసి ప్రజలు విమర్శలు గుప్పించారు.

– ఉరవకొండ

పెద్దారెడ్డిది హద్దు లేని అవినీతి

అక్రమంగా వందల కోట్ల సంపాదన.. తాడిపత్రి ప్రాంతానికి సాగు, తాగునీరు ఇస్తాం

రెడ్‌బుక్‌లో టీడీపీ వారిని ఇబ్బంది పెట్టిన వారి పేర్లు... తాడిపత్రి శంఖారావం సభలో నారా లోకేశ్





తాడిపత్రిలో నిర్వహించిన శంఖారావం సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్, ఐక్యత చాటుతున్న నాయకులు

తాడిపత్రిటౌన్, మార్చి11: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అరాచకాలు, అవినీతికి హద్దే లేకుండా పోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. తాడిపత్రిలోని కడపరోడ్డులో సోమవారం టీడీపీ శంఖారావం సభ నిర్వహించారు. సభకు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది టీడీపీ అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన నారా లోకేశ్ మాట్లాడుతూ చింతల వెంకటరమణస్వామి, బుగ్గరామలింగేశ్వరస్వామి కొలువైన ఆధ్యాత్మిక కేంద్రం తాడిపత్రి అని పేర్కొన్నారు. ఈ నేలపై మహాత్మాగాంధీ నడిచారన్నారు. దివంగత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసినప్పుడు మొట్టమొదట ఉద్యమించిన ప్రాంతం తాడిపత్రి అని తెలిపారు.

నా జీవితం తాడిపత్రి ప్రజలకు అంకితం



తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి, సిద్ధిబాషా దర్గా, సీఎస్ఐ చర్చిల సాక్షిగా నా జీవితం తాడిపత్రి ప్రజలకు అంకితం. వారి అభివృద్ధికి నిరంతరం పనిచేస్తా. ప్రజాసమస్యలపై గళమెత్తడంలో నారా లోకేశ్ పోరాటపటిమను చూస్తున్నా. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎన్నికష్టాలు ఎదురైనా మా కార్యకర్తలు పోరాడుతున్నారు. తాడిపత్రి మున్సిపాలిటీని దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి నా తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిది. రాబోయే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో తాడిపత్రిలో మౌలిక సదుపాయాలను కల్పించాలి. మా ప్రాంతంలోని రైతులు కష్టజీవులు. కన్నీటితోనైనా పొలాలను సాగుచేసే శక్తి మావారికి ఉంది. చాగల్లు, పెండేకల్లు రిజర్వాయర్లు, పెద్దవడుగూరు, యాడికి బ్రాంచ్ కెనాల్ నిర్మించినా నీటి కేటాయింపులు లేవు. మన ప్రభుత్వం రాగానే నీటి కేటాయింపులు జరిగేలా కృషి చేస్తా. మన ప్రభుత్వం రాగానే తాడిపత్రిని ఇండస్ట్రీయల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.

- జేసీ అశ్మిత్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్

రు. బీసీలకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి భద్రత కల్పిస్తామన్నారు. తాడిపత్రిలో 1800టిడ్కో గృహాలను పూర్తిచేశామని, మరో 4500ఇళ్లను కట్టించి పేదలకు అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలిచిన తాడిపత్రి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రస్తుతం ఏ పనులు చేయనీయడం లేదని దుయ్యబట్టారు.

ఇబ్బంది పెట్టిన వారికి వడ్డీతో చెల్లిస్తా

తాడిపత్రి ప్రాంతంలో వెయ్యి మంది టీ డీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వీటిలో జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 102 కేసులు పెట్టారన్నారు. ఏ తప్పు చేయని జేసీ అశ్మిత్‌రెడ్డిపై కూడా అక్రమ కేసులు పెట్టి తండ్రి, కొడుకులను జైలులో పెట్టించారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరి పేరు రెడ్‌బుక్కులో రాసుకున్నానని వడ్డీతో తాను వ్యక్తిగతంగా చెల్లిస్తానని హెచ్చరించారు.

అవినీతితో కోట్లకు పడగలెత్తిన ఎమ్మెల్యే

2019 ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిన్నకార్లు వేసుకొని తిరిగేవాడన్నారు. ఎమ్మెల్యే అయ్యాక కోట్లరూపాయలు విలువగల కార్లలో తిరుగుతున్నాడన్నారు. ఇసుక, మట్టి, రియల్‌ఎస్టేట్, పరిశ్రమల్లో భారీ మొత్తంలో వసూలు చేసి వందల కోట్లకు పడగలెత్తాడన్నారు. చివరికి పందుల పెంపకందారులతో కూడా కప్పం వసూలు చేశాడన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పన్నులు, కరెంట్ బిల్లులతో గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమల యజమానులను ఇబ్బంది పెట్టారన్నారు. తాడేపల్లిలో జగన్‌రెడ్డి వసూలు చేస్తే, తాడిపత్రిలో పెద్దారెడ్డి దండుకుంటున్నాడని ఆరోపించారు. తాడిపత్రి ప్రాంతంలో 80శాతంమేర ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాటన్నింటిని తెరిపించి ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. చేనేత కార్మికులను ఆదుకుంటామన్నారు. పెండేకల్లు, చాగల్లు, యాడికి కాలువ, పెద్దవడుగూరు హెచ్చెల్సీకి నీరు తెప్పించి సాగు, తాగునీరు అందించే బాధ్యత తనదని తెలిపారు. మైనార్టీలకు రద్దు చేసిన పథకాలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎప్పటికి యువకుడే

అభివృద్ధి విషయంలో తన తండ్రి నారా చంద్రబాబునాయుడు, జేసీ అశ్మిత్‌రెడ్డి తండ్రి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎప్పటికి యువకులుగానే ఆలోచిస్తారని పేర్కొన్నారు. తాను పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తాడిపత్రి అభివృద్ధి కోసం రూ.2వేల కోట్లు మంజూరు చేసేంతవరకు పట్టువదలని విక్రమార్కుడు జేసీపీఆర్ వెంటపడ్డాడని కొనియాడారు. 40ఏళ్ల పాటు అభివృద్ధికి పాటుపడిన జేసీ కుటుంబాన్ని కాదని 2019ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి గెలిపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాడిపత్రిలో మాత్రమే టీడీపీ గెలవడానికి జేసీపీఆర్ చేసిన అభివృద్ధే కారణమన్నారు. అందుకే నిరంతరం అభివృద్ధి మంత్రం జపించే జేసీ కుటుంబానికి ఎన్నికల్లో అండగా ఉండి జేసీ అశ్మిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి తనతోపాటు అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారు. తాడిపత్రికి ఇచ్చిన హామీలన్ని నెరవేర్చే బాధ్యత తనదని తెలిపారు

జేసీపీఆర్‌పై పెట్టినన్ని అక్రమ కేసులు దేశంలో ఎవ్వరిపైనా పెట్టలేదు



తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై వైసీపీ ప్రభుత్వం పెట్టినన్ని అక్రమ కేసులు దేశంలో ఏ రాజకీయ నాయకుడిపై పెట్టలేదు. ఎన్నికేసులు పెట్టినా ప్రజల అభివృద్ధి కోసం జేసీపీఆర్ ఏమాత్రం వెనుకంజ వేయలేదు. ఆయన వారసుడిగా ప్రజల్లోకి వచ్చిన జేసీ అశ్మిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

- కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలి



ఉమ్మడి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలి. తాడిపత్రిలో ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడటంతోపాటు రాక్షస పాలన సాగుతోంది. మున్సిపల్ ఛైర్మన్‌గా జేసీ ప్రభాకర్ రెడ్డిని గెలిపించినప్పటికీ ఎమ్మెల్యే ఏ అభివృద్ధి పని చేయనీయడం లేదు. ప్రజలు అభివృద్ధి కోసం పెద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన మాత్రం ప్రతిపక్షనేతల ఇళ్లపైకి మారణాయుధాలతో వెళుతున్నారు. మా అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలే నాకు, మా నాయకులు, కార్యకర్తలకు శిరోధార్యం. జేసీ అశ్మిత్‌రెడ్డి గెలుపునకు అవిశ్రాంతిగా కృషి చేస్తా.

- కదిరి శ్రీకాంత్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి

టీడీపీ ఫ్లెక్సీలు ధ్వంసం

తాడిపత్రిటౌన్, మార్చి11: శంఖారావం సభను పురస్కరించుకొని పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలోని ఎమ్మార్పీ భవనం వరకు టీడీపీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం తెల్లవారుజామున వైసీపీ మద్దతుదారులు ధ్వంసం చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, చింబిలి ప్రసాద్‌నాయుడు, రాము, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారని వారన్నారు.





ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు

అవినీతి ఎమ్మెల్యే అనంత..!

కమీషన్ తీసుకోనిదే పనిచేయడు

పాపాల పెద్దిరెడ్డి జిల్లాకొస్తే తరిమికొట్టండి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



మాట్లాడుతున్న నారా లోకేశ్

అనంతపురం అర్బన్, మార్చి 11: అనంత వెంకటరామిరెడ్డి అవినీతి ఎమ్మెల్యే అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. చేతగాని, కమీషన్లు తీసుకునే ఎమ్మెల్యే ఆయన అని విమర్శించారు. ఆయనకు '9 నంబర్స్' ఎమ్మెల్యే అని పేరు ఉందని, ఎవరైనా వెళితే హడావుడిగా 9 నంబర్లతో ఫోన్ చేసి బిల్డప్ ఇస్తారని ఎద్దేవా చేశారు. జగన్ మాదిరిగా ఇక్కడ ఈయన బిల్డప్ ఇస్తున్నారని, పనులు చేయలేని చేతగాని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అని విమర్శించారు. పీవీకేకే కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. పాపాల పెద్దిరెడ్డి చిత్తూరు జిల్లాను అడ్డగోలుగా దోచేశారని, ఎక్కడ పేదోడి భూమి కనబడినా దోచేస్తారని, దొంగ పత్రాలు సృష్టిస్తారని ఆరోపించారు. బాధితుల తరుఫున పోరాడిన వారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేయిస్తారని అన్నారు. అక్కడ దొబ్బింది చాల్లేదని అనంతపురం జిల్లాపై పడ్డారని మండిపడ్డారు. పాపాల పెద్దిరెడ్డి వస్తే తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పాపాల పెద్దిరెడ్డిని పొరపాటున రానిస్తే మన ఇంటిపైన చిప్పకూడా మిగల్చరని హెచ్చరించారు.

చైతన్యం ఎక్కువ..

విద్యావంతులు పుట్టిన నేల అనంతపురం నగరం అని అన్నారు. అనంతపురం ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువ అని లోకేశ్ అన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్‌ను బర్తరఫ్ చేస్తే అనంత నుంచే ఉద్యమం ప్రారంభమైందని గుర్తు చేశారు. 2014-19 టీడీపీ హయాంలో వైకుంఠం ప్రభాకర్ చౌదరి నాయకత్వంలో రూ.1500 కోట్లు ఖర్చు పెట్టి అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, బ్రిడ్జిలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి పథకాలు అందించింది తెలుగుదేశం పార్టీనే అని అన్నారు. ఆరువేల టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు చేశామని, మిగిలిన 10 శాతం పనులు కూడా దద్దమ్మ ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. అనంత పట్టణానికి తాగు నీటి కోసం రూ.91 కోట్లతో పైపు లైన్లు వేశామని, 11 రిజర్వాయర్లు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని అన్నారు. ఈ దద్దమ్మ ప్రభుత్వానికి కనీసం పైపు లైన్లను వాడుకోవడం కూడా చేతకావడం లేదని అన్నారు. స్టేడియాన్ని అభివృద్ధి చేశామని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించామని అన్నారు. ఆ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తగిన డాక్టర్లను నియమించలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థిని అనంత అర్బన్‌లో భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాగానే ఔటర్ రింగ్ రోడ్డు, అనంతలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో ఇళ్లు పూర్తి చేసి పేదలకు అందజేస్తామని అన్నారు. గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును తరలించి, మోడరన్ డంపింగ్ యార్డు తీసుకొచ్చే బాధ్యత తనదని అన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల నిర్వహణలో బాగా పనిచేసిన వారికి ఉత్తమ కార్యకర్త అవార్డులను అందజేశారు.

అలుపెరగని యోధుడు లోకేశ్

- ప్రభాకర్ చౌదరి



యువగళం పాదయాత్ర ద్వారా నవగళాన్ని వినిపించిన అలుపెరగని యోధుడు నారా లోకేశ్ అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కొనియాడారు. టీడీపీ హయాంలో పంచాయతీరాజ్ మంత్రిగా తనదైన ముద్ర వేశారని అన్నారు. యువగళంలో స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధుల అవినీతి, అక్రమాలను ఎండగట్టి, పార్టీ శ్రేణులలో నూతన ఉత్తేజాన్ని నింపారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శంఖారావం ద్వారా సమర శంఖం పూరించి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గౌరవించడంతోపాటు వైసీపీ ఆగడాలను ఎండగడుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల యుద్ధానికి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్ పాలనలో వ్యత్యాసాలను ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు. వైఎస్సార్, జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేస్తే అధికారంలో ఉన్న చంద్రబాబు ఎలాంటి ఇబ్బందులు సృష్టించలేదని, ప్రభుత్వపరంగా సహకరించారని అన్నారు. చంద్రబాబు, నారా లోకేశ్ పాదయాత్ర చేసిన సమయాల్లో అనేక అడ్డంకులు సృష్టించారని, వాటని అధిగమించి ఇద్దరు నాయకులు పాదయాత్రను కొనసాగించారని అన్నారు. సీఎం జగన్‌ను వైసీపీ ఎమ్మెల్యేలు నేరుగా కలిసే పరిస్థితి లేదని అన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన వియ్యంకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండ చూసుకొని రాజ్యాంగేతర శక్తిగా మారాడని విమర్శించారు. సుభాష్ రోడ్డు, గుత్తి రోడ్డులను టీడీపీ హయాంలో మంజూరు చేయించామని, ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభించలేపోయామని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల నొక్కేందుకు రోడ్డు పనులను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. రాజీవ్ కాలనీలో టీడీపీ హయాంలో బ్రిడ్జి నిర్మిస్తే, జగనన్న వారధి అని పేరు పెట్టుకున్నారని విమర్శించారు. ఎంపీగా లోక్ సభలో, ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ఏ నాడు ప్రజల సమస్యలపై అనంత వెంకటరామిరెడ్డి నోరుమెదపలేదని, అలాంటి వ్యక్తి అభివృద్ధి అంతా తానే చేశానని అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. అనంత అన్నదమ్ములు శాఖలు పంచుకొని మామూళ్లు దండుకుంటున్నారని ఆరోపించారు. అనంత వెంకటరామిరెడ్డి మాదిరిగా తాను అవినీతికి పాల్పడలేదని అన్నారు. నిజాయితీ, నిబద్ధతతో అనంత అర్బన్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేశానని అన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ కోసం, చంద్రబాబును సీఎంను చేసుకునేందుకు, సైకో జగన్ పారదోలేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.



సూపర్‌సిక్స్ బ్యాగు ప్రభాకర్‌చౌదరికి అందజేస్తున్న నారా లోకేశ్

కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడు

- టీసీ వరుణ్



వైసీపీ సిద్ధం సభలకు బస్సులు పెట్టి, మందు, బిర్యానీలు ఇచ్చి జనాన్ని బలవంతంగా తరలిస్తున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. సిద్ధం సభల్లో సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం తప్ప సీఎం జగన్ చేసిందేమీ లేదని అన్నారు. నారా లోకేశ్ శంఖారావం సభలకు టీడీపీ, జనసేన కార్యకర్తలు నిస్వార్థంగా వస్తున్నారని అన్నారు. రోడ్లపైకి వచ్చి ఓట్లు అడిగే పరిస్థితిలో జగన్ లేరని, అందుకే సిద్ధం సభల్లో కార్యకర్తలను రెచ్చగొట్టి, మీడియా ప్రతినిధులపై దాడులు చేసి మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారని అన్నారు. దేనికోసం సిద్ధం సభలు పెడుతున్నారు అని సీఎం జగన్‌ను నిలదీశారు. 'రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేనందుకా? ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీ వేతనాలు ఇవ్వనందుకా? నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నందుకా? పంటనష్టపోయిన రైతులకు న్యాయం చేయలేనందుకా? రోడ్డు వేయనందుకా..? మద్యం ఏరులై పారించేందుకా..? నువ్వు, నీ ఎమ్మెల్యేలు ఇసుకను అడ్డగోలుగా అమ్ముకునేందుకా..?' అని ప్రశ్నలు సంధించారు. 'హూ కిల్డ్ బాబాయ్?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పి ప్రజలను ఓట్లు అడగాలని సూచించారు. ఇలాంటి అసమర్థ సీఎంను ఎన్నడూ చూడలేదని అన్నారు. టీడీపీ, జనసేన కూటమితో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని అన్నారు. డంపింగ్ యార్డు మార్పు, అండర్‌డ్రైనేజీ నిర్మాణం హామీలు గాలికి వదిలేశారని అన్నారు. అనంత అర్బన్‌లో పారిశుధ్య సమస్య అధికంగా ఉందని, రోడ్లు అధ్వాన్నంగా మారాయని అన్నారు. గత రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అనంత అర్బన్‌లో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అనంత అర్బన్ విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి, భారీ మెజార్టీతో అభ్యర్థిని గెలిపించుకుంటామని అన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

40 డిగ్రీల చేరువలో ఉష్ణోగ్రతలు

బుక్కరాయసముద్రం, మార్చి 11: ఈ ఏడాది మార్చిలోనే సూరీడు మండిపోతున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీల చేరువలో ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మార్చి తొలివారంలోనే జిల్లాలో శింగనమల మండలం తరిమెల గ్రామంలో అత్యధికంగా 41 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యిందని, రానున్న రోజుల్లో ఈ ఏడాది 47, 48 డిగ్రీల సెల్సియస్ కూడా నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ వాతావరణ శాఖ ఇప్పటికే జిల్లా వాతావరణ నిపుణులకు ముందస్తు సమాచారం చేరవేసింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మార్చి నుంచి మే వరకు ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో వచ్చే మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితి ఏర్పడుతుందని, అందువల్ల వేసవి కాలం మరింత వేడిగా మారుతుందని వాతావరణ శాస్త్రవేత్త సూచించారు. ప్రస్తుతం ఉదయం 9 గంటలు దాటితే సూరీడు భగభగ మండిపోతున్నాడు. బయటకు పోవాలంటే ప్రజలు భయందోళన చెందుతున్నారు. మండే ఎండలకు తోడు... వడగాల్పులు ఉమ్మడి జిల్లాలో మొదలయ్యాయి. ఆదివారం పామిడి మండలంలో వడదెబ్బతో పండ్లు అమ్ముకునే ఓబిలేసు (48) మరణించిన విషయం తెలిసిందే.

అనంత జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు

అనంతపురం జిల్లాలో సోమవారం అత్యధికంగా బొమ్మనహాల్ 38.79, కూడేరు 38.67 అనంతపురం 38.59, శింగనమల 38.57, పామిడి 38.5, యల్లనూరు 38, గుమ్మగట్ట 37.91 నమోదు అయ్యాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో...

రామగిరి 38.59, కొత్తచెరువు 38.53, ముదిగుబ్బ 38.5, పరిగి 38.5, ధర్మవరం 38.29, రొద్దం 37.82, బత్తలపల్లి 37.79 నమోదయ్యాయి.

నేడు గుంతకల్లు మీదుగా వందే భారత్ రైలు ప్రారంభం

గుంతకల్లు, మార్చి 11: రైల్వే డివిజన్‌లోని వివిధ స్టేషన్ల మీదుగా వెళ్లే వందే భారత్ రైలును ప్రధానమంత్రి మంగళవారం ప్రారంభించనున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ నాగరాజన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో సీనియర్ డీసీఎం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, మరికొన్నింటికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా కలబురగి-బెంగళూరు మధ్య వందే భారత్ రైలును ప్రారంభిస్తారన్నారు. ఈ రైలు రైల్వే డివిజన్‌లోని రాయచూరు, మంత్రాలయం, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. డివిజన్‌లోని తిరుపతి-కొల్లాం, బెంగళూరు-గుల్బర్గ మధ్య కూడా వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. గుంతకల్లు-గుంటూరు సెక్షన్‌లో డబ్లింగ్ కార్యక్రమంలో భాగంగా పాక్షికంగా పూర్తయిన 303 కి.మీ.ల లైన్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఈ రూటులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గ్రీన్ సిగ్నల్ లభించనుందన్నారు. వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ పథకం కింద రైల్వే డివిజన్‌లో 23 విక్రయ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. గతి శక్తి కార్గో టెర్మినల్‌గా ప్రారంభమైన నక్కనదొడ్డి ఐటీసీ టెర్మినల్‌లోపాటు, మరో రెండు టెర్మినళ్లను జాతికి అంకితం చేయనున్నారని తెలియజేశారు. సమావేశంలో డీసీఎం సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

అయ్యో.. పాపం..!

ఆటో ఢీకొని చిన్నారి దుర్మరణం



షాహిదా (ఫైల్)

బత్తలపల్లి, మార్చి 11: స్థానిక బృందావన కాలనీలో సోమవారం ఆటో ఢీకొని చిన్నారి షాహిదా (2) దుర్మరణం చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. షేక్ బాషా, ఫాతిమా దంపతులకు ఏడుగురు సంతానం.ఆరో సంతానమైన షాహిదా ఇంటి ముందు అడుకుంటుండగా తాగునీటి ఆటో ఢీకొట్టింది. ఆటోను ఆపకుండా వెళ్లిపోతుండగా.. స్థానికులు గమనించి, అడ్డుకున్నారు. ఆటోను ఆపి చిన్నారిని పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఏఎస్ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

పట్టపగలే దోపిడీ

దుకాణంలోకి చొరబడిన దుండగులు

మహిళ గొంతుకోసి.. బంగారు, నగదు అపహరణ



గాయపడిన అమృత

ధర్మవరం, మార్చి 11: ధర్మవరంలో పట్టపగలే దుండగులు దోపిడీకి తెగబడ్డారు. పట్టణంలోని పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన రద్దీగా ఉండే ప్రాంతంలో ఓ దుకాణంలోకి గుర్తుతెలియని దుండగులు చొరబడ్డారు. దుకాణంలోని మహిళ గొంతుకోసి బంగారు చైను, కొంత నగదు అపహరించుకెళ్లారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో సోమవారం ఈ ఘటన భయాందోళనలు రేకెత్తించింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన అమృత అనే మహిళ ఇంటి వద్ద జనరల్ స్టోర్ నిర్వహిస్తోంది. గుర్తుతెలియని దుండగులు ముగ్గురు సోమవారం మధ్యాహ్నం దుకాణంలోకి చొరబడ్డారు. అమృత గొంతుకోసి, మెడలోని గొలుసు లాక్కుని, దుకాణంలోని నగదు ఎత్తికెళ్లారు. ఆ సమయంలో అమృత కుటుంబసభ్యులు వేరే గ్రామానికి వెళ్లారు. గాయపడిన ఆమెను స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. ఇటీవలిగా పట్టణంలో చోరీలు అధికమవడంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఈ చోరీలు.. పోలీసులకు సవాల్‌గా మారాయి.

స్వయం సహాయక సంఘాలకు కేంద్రం రూ.121 కోట్లు నిధులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11: జిల్లాలో కరువును దృష్టిలో ఉంచుకుని స్వయం సహాయక మహిళా సంఘాలకు కేంద్రప్రభుత్వం రూ.121 కోట్ల నిధులు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్ తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల జీవనోపాధుల పెంపునకు లఖ్‌పతి దీదీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన 1,464 స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన రూ.121 కోట్ల చెక్‌ను పీడీ, ఎల్‌డీఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైకేపీ ఏపీడీ ఈశ్వరయ్య, ప్రాజెక్ట్ మేనేజర్లు రాధారాణి, సత్యనారాయణ, చంద్రధర్, ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

నారాలోకేశ్‌ను కలిసిన ప్రముఖులు



నారా లోకేశ్‌ను కలిసిన దగ్గుబాటి ప్రసాద్, రాయల్ మురళి, ఉమర్ ముక్తార్

అనంతపురం అర్బన్/ ప్రెస్‌క్లబ్, మార్చి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను పలువురు టీడీ పీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమ వారం స్థానిక పీవీకేకే కళాశాల ప్రాంగణం శిబిరం వద్ద పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర నాయకుడు దగ్గుబాటి ప్రసాద్, టీడీపీ బీసీ సెల్ నాయకులు దళవాయి వెంకట నారాయణ, సిమెంట్ పోలన్న, జరిపిడి కృష్ణమూర్తి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంక టేష్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీన రసింహులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మీ నరసింహులు లోకేశ్‌ను కలిశారు. అలాగే తాడిపత్రిలో నిర్వహించిన శంఖారావం సభలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ నారా లోకేశ్‌ను కలిశారు. జడ్పీ మాజీ ఛైర్మన్ చమన్‌సాబ్ తన యుడు ఉమర్ ముక్తార్ లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ ఉమర్ ముక్తార్‌ను దూదేకుల కుల స్తుల అభివృద్ధి తదితర అంశాలపై ఆరా తీసినట్లు తెలి పారు. ఆయనతో దూదేకుల సంఘం నాయకులు ఉన్నారు.

ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



శయనోత్సవంలో శివపార్వతులు

అనంతపురం కల్చరల్, మార్చి 11: స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం కాశీవిశ్వేశ్వరస్వామికి పంచామృ తాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో స్వామివార్ల ఉత్సవమూర్తులకు త్రిశూలస్నానం, వసంతోత్సవం గావించారు. అదేవిధంగా ఆలయ సిబ్బంది, భక్తులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు. అనంతరం రుద్రహోమం నిర్వహించి, మహాపూర్ణాహుతి గావించారు. తదనంతరం ఉత్సవాల ముగింపు సూచికగా ధ్వజ అవరోహణ గావించి, ధ్వజస్తంభ జెండాతో ఆలయ ప్రదక్షిణ చేశారు. రాత్రి ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు శయనోత్సవ సేవను నిర్వహించారు.



టీసీ వరుణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాయగూరల లక్ష్మిపతి, జనసేన నేతలు

ఘనంగా జనసేన నేత టీసీ వరుణ్ జన్మదినం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 11 : జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. సోమవారం టీసీ వరుణ్ నివాసానికి వెళ్లిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాయగూరల లక్ష్మిపతి ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీసీ వరుణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, నగర ఉపాధ్యక్షుడు గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, నాయకులు వెన్నెల కృష్ణ, మధు, రామ్మోహన్, చిరంజీవి పాల్గొన్నారు.

జగన్ ఓటమే లక్ష్యం



ధర్నాలో మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 11: కులవృత్తుల కార్పొరేషన్లకు నయాపైసా నిధులు కేటాయించకుండా ఆ వర్గాలను సీఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని, రానున్న ఎన్నికల్లో అతన్ని గద్దెదించేవరకూ పోరాటం చేయాలని చేతివృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లను పునరుద్ధరించి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం ఆ సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్ల పోతులయ్య, రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి నాగప్ప, మహిళా నాయకురాలు ఈశ్వరమ్మ, నాగరాజు, భూషణం, వీరాంజనేయులు, గోవిందరాజులు, నారప్ప, నారాయణ, శ్రీనివాసులు, నరసిహులు, వెంకటేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు ఆర్ట్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

అనంతపురం సెంట్రల్, మార్చి 11: డిగ్రీ కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలను అందజేసేందుకు మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తెలిపారు. గ్రంథాలయ భవన్‌లోని డ్రామా హాల్లో నిర్వహించే వేడుకలో ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి విద్యార్థులకు డిగ్రీ పట్టాలందజేస్తారన్నారు. అదేవిధంగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలాభాస్కర్, ఆర్జీ నాగలింగారెడ్డి, ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ తులసి, సప్తగిరి క్యాంపర్ సంస్థ మహ్మద్ హనీఫ్ పాల్గొంటారన్నారు.

ఏఆర్ఎస్ఐ అంత్యక్రియలు

అనంతపురం క్రైం, మార్చి 11: స్థానిక కొవ్వూరు నగర్‌లో నివాసముంటున్న ఏఆర్ఎస్ఐ హాజీపీరా (61) ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన 1987లో ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. స్థానిక ముస్లిం శ్మశాన వాటికలో సోమవారం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్ పాల్గొన్నారు. హాజీపీరాకు భార్య, కుమార్తె ఉన్నారు.

జిల్లా 'స్పందన'కు 255 అర్జీలు

అనంతపురం టౌన్, మార్చి 11: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్పందనకు మొత్తం 255 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల విధుల్లో కలెక్టరు గౌతమి బిజీగా ఉండటం, జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ విజయవాడకు వెళ్లడంతో వారు స్పందనకు హాజరుకాలేదు. దీంతో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టరు ఆనంద్, ఆర్డీఓ గ్రంధి వెంక టేష్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ వినతులు స్వీకరించారు.

దళిత భూములను కాజేయడమే గ్రామ స్వరాజ్యమా?

అనంతపురం సెంట్రల్, మార్చి 11: వైసీపీ ప్రభుత్వం దళితుల భూములను కాజేయడమే గ్రామ స్వరాజ్యమా అని బహుజన లాయలర్స్ ఫోరం (బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన బ్రహ్మసముద్రం ఎరడికెరకు చెందిన జంగమయ్య వ్యవసాయ పొలాన్ని సోమవారం సందర్శించిన ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ రక్షణ చట్టాలను తీసుకువచ్చి వైసీపీ ప్రభుత్వం.. దళితుల భూములను పెత్తందార్లకు కట్టబెడుతోందని ఆగ్రహించారు. ఐదేళ్లలో భూములను కోల్పోయిన దళితులకు బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో న్యాయ సహాయ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పెత్తం దార్లు వారిపేరుపై ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకుని అన్యాయంగా అనుభవిస్తు న్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కళ్యాణదుర్గం జూని యర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో దావావేస్తామని తెలిపారు.

గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్

శింగనమల, మార్చి 11: గ్రామాల్లో విషజ్వరాలు, డెంగీ విజృంభిస్తుండటంతో అపరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ఎంపీడీఓ రమణ అన్నారు. సోమ వారం ఆంధ్రజ్యోతి వచ్చిన పెరుగుతున్న డెంగీ బాధితులు కథనానికి ఎంపీడీఓ స్పందించారు. శింగనమలలో అపరిశుభ్రత ప్రాంతాలను పరిశీలించారు. ఎంపీ డీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. గ్రా మాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి అపరిశుభ్రత ప్రాంతాల్లో అబెట్ మందును పిచికారి చేయిస్తానని, నిల్వ ఉన్న నీరులో ఆయిల్ వేయిస్తామని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె, మార్చి 11 : మండలంలోని పాపినేపాళ్యం గ్రామ సమీపంలో ఆది వారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మ ద్ గౌస్ తెలిపారు. శింగనమల మండలం తరిమెల గ్రామ సమీపంలోని పరివా హక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా గార్లదిన్నెకు ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు.

చీనీకాయలు టన్ను రూ.24 వేలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 374 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రామగిరి : వెంకటాపురం గ్రామంలో మాజీ మంత్రి పరిటాల సునీత సమ క్షంలో కనగానపల్లి కోట బీసీ కాలనీకి చెందిన వైసీపీకి చెందిన ఎనిమిది కు టుంబాల సభ్యులు సోమవారం టీడీపీలో చేరారు. పరిటాల సునీత మాట్లాడుతూ.. వైసీపీలో అనేక మంది వేధింపులకు గురవుతు న్నారని, వారంతా ధైర్యంగా టీడీపీలో చేరవ చ్చని, వారికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనగానపల్లి మండల కన్వీనర్ యాతంపోతలయ్య, నెట్టెం వెంకటేశ్, ఎంపీటీసీ భాస్కర్, సుబ్బయ్య, బాలయ్య, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేసిన వైసీపీ నాయకులు

గ్రామాల్లో టీడీపీ విస్తృత ప్రచారం



కానుగులకుంట, యర్రగుంటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, మార్చి 11: మండలంలోని కానుగులకుంట, కంచికుంట, చిన్నకొండాపురం, రెడ్డివారిపల్లి, ముత్యాలంపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయ కులు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీ పీ నాయకులు రామ్మూర్తినాయుడు, పరందామయాదవ్, సుధాకర్, మాజీ సర్పంచ్‌ముత్యాలు, మారుతీప్రసాద్, సుబ్బరాయుడు, పోతన్న, బొమ్మయ్య, శ్రీధర్‌నాయుడు,శివకుమార్, గుర్రంశీన, పేపర్‌శీన, ఎస్ ఆంజనేయులు, విశ్వనాథ్, తిరుపాలు, అక్కులప్ప, తిరుపాలప్ప, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : యర్రగుంటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారామ్, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, రాప్తాడు సర్పంచ్ తిరుపాలు, మరూరు గోపాల్, ఇంద్ర, సాకే జయరాముడు, వెంకట్రాముడు, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పుల్లలరేవు గోపాల్, బీరన్న, కిష్టా, కొత్తపల్లి నారాయణస్వామి, ముత్యాలప్ప పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలంలోని పాతపాళ్యం, గుంతపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, తెలుగు యువత బట్టా సురేష్ చౌదరి, పాతపాళ్యం రాజాకృష్ణ, నాగభూషణం, ప్రసాద్, తలారి రాజప్ప, మాదినేని సుబ్బయ్య బిల్లే దామోదర్, బొజ్జన్న, బాలునాయక్, రమణ, కుళ్లాయప్ప, సర్పంచ్‌లు మాదవరాజు, రామాంజి, అంజి, బాలయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని పీ యాలేరు గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటి పథకాలపై విస్తృత ప్రచారం నిర్వ హించారు. ఇందులో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీ నర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురామ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు క్రిష్ణమోహన్ చౌదరి, వెంకటనారాయణ పాల్గొన్నారు.



పాతపాళ్యం, పి యాలేరు గ్రామంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

హుండీ ఆదాయం లెక్క చెప్పండి

- ఈఓను నిలదీసిన పూజారి కుటుంబ సభ్యులు
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

శింగనమల, మార్చి 11: శింగనమల మండలం శివపురం పెద్దమ్మ గుడి హుండీ ఆదాయం లెక్కింపు ఉద్రిక్తతకు దారి తీసింది. ఆ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించడానికి ఈఓ శోభారాణి, అధికారులు ఆ గ్రామానికి వెళ్లారు. అయితే గత హుండీ ఆదాయాన్ని ఏం చేశారో చెప్పాలంటూ ఆ ఆలయ పూజారి కుటుంబ సభ్యులు ఆమెను నిలదీశారు. ఆ వివరాలు మీకెందుకు చెప్పాలంటూ ఈఓ వారితో దురుసుగా ప్రవర్తించింది. దీంతో పూజారి కుటుంబసభ్యులు హుండీ ఆదాయాన్ని లెక్కించడాన్ని అడ్డుకున్నారు. ఈఓ పోలీసుల సాయంతో ఆలయంలోని హుండీని బయటకు తేవడానికి యత్నించారు. దీన్ని నిరసిస్తూ పూజారి కుటుంబ సభ్యులు వెంకట లక్ష్మమ్మ, కూతురు అంబిక, అల్లుడు నాగార్జున పెట్రోల్ పోసుకొని.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఏఎస్ఐ చింతబరయ్య, పోలీసులు వారిని అడ్డుకున్నారు. వారిని శింగనమల పోలీస్ స్టేషన్ తరలించారు. హుండీ ఆదాయం లెక్కింపు అడ్డుకుంటే కేసులు పెడతామని పూజారి కుటుంబ సభ్యులను ఈఓ హెచ్చరించింది. అనంతరం సాయంత్రం గుడి వద్దనే హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. కాగా, హుండీ ఆదాయ వివరాలను ఈఓ సరిగా వెల్లడించకపోవడంపై ఆ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న పూజారి కుటుంబ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా మహిళలు

ఘనంగా మహిళా దినోత్సవం

అనంతపురం కల్చరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, యూటీ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ, ఉపాధ్యక్షురాలు రామాం జినమ్మ, లక్ష్మి, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నాయకులు వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, తిరుమలేసు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

నాగమణి ఇంటిని కూల్చేశారు



పడగొట్టిన నాగమణి ఇల్లు

అనంతపురం రూరల్, మార్చి 11: మండలంలోని బసవతారకనగర్‌లో నివాసముం టున్న నాగమణి ఇంటిని కూల్చేశారు. కొన్ని రోజు లుగా ఆమె ఇల్లు ఉన్న స్థలం తనదంటూ తాడి పత్రి పట్టణంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవి శంకర్ నాగమణితో గొడవపడుతూ వస్తు న్నాడు. ఈ క్రమంలో వారం క్రితం ఇంటిని పడ గొట్టే ప్రయత్నం చేశాడు. అయితే నాగమణి పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో వెనకుతగ్గారు. తిరిగి సోమవారం నాగమణి ఎస్పీని కలసి తన సమ స్యను చెప్పుకునేందుకు వెళ్లింది. అక్కడ ఎస్పీ లేకపోవడంతో తిరిగి ఇంటికొచ్చే సరికి రవిశంకర్ ఇంటిని దౌర్జన్యంగా పడగొట్టినట్లు నాగమణి వాపోయింది. 20 ఏళ్లగా నివాసముంటున్న తన ఇల్లు కూలిపోయి ఉండటాన్ని చూసి.. కన్నీంటి పర్యంత మైంది. ఇంటి స్థలం తనదని కానిస్టేబుల్ రవిశంకర్ నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్నా రని నాగ మణి చెప్పుకొచ్చింది. ఇదే దిగులుతోనే తన భర్త కూడా అనారోగ్యానికి గురై మర ణించాడని ఆవేదన వ్యక్తం చేసింది. కానిస్టేబుల్ బెదిరిం పులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయింది. ఈ రోజు కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సమయంలో కానిస్టేబుల్ ఇంటిని కూల్చివేసినట్లు చెప్పుకొచ్చింది. అధికారులే తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.

నేషనల్ ఉమెన్ లెజండరిగా అధ్యాపకురాలు ఫిరోజ



అనంతపురం సెంట్రల్, మార్చి 11: 'నేషనల్ ఉమెన్ లెజండరి'గా ఎస్ఎస్ బీఎన్ కళాశాల తెలుగుశాఖ అధ్యాపకురాలు డాక్టర్ వాధులపల్లి ఫిరోజ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలం దించిన మహిళలకు తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, భంసాయి సేవా ట్రస్ట్, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ ఉమెన్ జెంజడరి అవార్డులకు ఎంపికచేశారు. ఇందులో భాగంగా ఎంపికైన ఫిరోజకు ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆ అవార్డును అందజేశారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ



తృతీయ స్థానం సాధించిన జిల్లా మహిళల హాకీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11: రాష్ట్రస్థాయి మహిళా హాకీ పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయ స్థానం దక్కింది. ఆదివారం ప్రకాశం జిల్లా మైనంపాడులో 14వ ఏపీ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. వారితో పాటుకోచ్ వెంకటేష్‌కు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి అనీల్‌కుమార్, సహాయ కార్యదర్శి అక్రమ్‌భాషా, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్ అభినందనలు తెలిపారు.

పంట మార్పిడితో కాండం కుళ్లు తెగుళ్లకు చెక్

అనంతపురంరూరల్, మార్చి 11: పంట మార్పిడితో కాండం కుళ్లు తెగుళ్లను నివారించవచ్చనని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు సూచించారు. సోమవారం మండలంలోని మన్నీల గ్రామంలో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించిన వారు మాట్లాడారు. పంట కాయలు ఊరే దశ, గింజ పట్టే దశలో ఉందని, పైరుకు కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించినట్లు తెలిపారు. కాండం కుళ్లు బూజు తెగులు కలుగ చేసే శిలీంద్రము భూమి ద్వారా విత్తనం ద్వారా చెందుతుందన్నారు. పంట 70 రోజుల నుంచి పంట చివరి రోజు వరకు కనిపిస్తుందన్నారు. కాండపు భాగాన్ని ఆశించడం వలన మొక్కలు వడలిపోయి చనిపోతాయన్నారు. ఈ తెగుళ్లు అధిక తేమ, అధిక ఉష్ణోగ్రత ఉన్నప్పుడు ఆశిస్తుందన్నారు. సజ్జజొన్న, జొన్న తదితర పంట మార్పిడి చేయాలన్నారు. అదేవిధంగా ఒక కిలో విత్తనానికి మూడు గ్రాముల మ్యాంకోజెబ్ లేదా స్ప్రింట్ 2.5 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసుకోవడం మంచిదన్నారు. పూత సమయంలో ఎకరానికి 200 కిలోలు జిప్సం వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజాకుమారి, వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, విహెచ్ఏ విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు బ్యాంకు ఉద్యోగి

గార్లదిన్నె, మార్చి 11: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో గతంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన హర్షవర్ధన్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. గార్లదిన్నెలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో 2018లో సుమారు 40 మంది ఖాతాదారుల ఖాతాల నుంచి వారికి తెలియకుండా సుమారు రూ. ఏడు లక్షలను ఆయన ఖాతాల్లోకి మళ్లించు కున్నాడన్నారు. దీంతో ఖాతాదారులకు అనుమానం వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, వారు విచారణ చేసి అతన్ని విధుల నుంచి తొలగించారని తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, పరారీలో ఉన్న హర్షవర్ధన్‌ను సోమవారం గార్లదిన్నె మండలం కల్లూరులోని తరిమెల క్రాస్ వద్ద ఉండగా అరెస్ట్ చేశామని తెలిపారు.

మోసాల జగన్‌రెడ్డిని గద్దెదింపుదాం

అనంతపురం సెంట్రల్, మార్చి 11: ఐదేళ్ల పాటు దళితులను మోసం చేసిన జగన్‌రెడ్డిని గద్దెదింపుదామని దళిత సంఘాల నాయకులు తేల్చిచెప్పారు. ఉరవకొండ గాంధీ హరిజన హాస్టల్ స్థల పరిరక్షణకు చలో కలెక్టరేట్ వంటవార్పు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్పందన ఫిర్యాదుల పత్రాలను దహనం చేశారు. దళిత సంఘాల నాయకులు సాకేహరి, ఆనంద్ రాజు, గోపాల్, ఎర్రిస్వామి, నల్లప్ప, కుళ్లాయప్ప మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో దళితుల భూములకు రక్షణ కరువైందన్నారు. 1933లో ఏర్పాటు చేసి ఉరవకొండ గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని ఆ పార్టీ నేతలు కబ్జాచేశారని మండిపడ్డారు. దాత గట్టు వెంకటరమణప్ప బిక్షాటనచేసి హరిజనోద్ధరనకిచ్చిన స్థలాన్ని ఆన్‌లైన్‌లో అక్రమంగా మార్చేశారని వాపోయారు. ఇలా జిల్లా వ్యాప్తంగా దళితుల భూములను ఆక్రమించిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధం కావాలన్నారు. రికార్డుల ఆధారంగా అడంగల్ రూపొందించాలని పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రికార్డులు మార్చిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సోమవారం వందలాది మంది పేదలు వారి సమస్యలు పరిష్కరించాలని స్పందనలో ఫిర్యాదు చేస్తున్నారని, అధికారులు వాటిని చెత్తబుట్టల్లో వేసి చేతులు దులుపు కుంటున్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించని స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమి ఎందుకు నిర్వహిస్తున్నారని నిలదీశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు గేట్లు వేసి అడ్డుకున్నారు. అనంతరం డీఆర్వో రామకృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యల్లప్ప, రమేష్, హనుమంతు, చెన్నకేశవ, మధు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నాయకుల నిరసన

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి : సీపీఎం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఈనెల 6వ తేదీలోపు ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం సాయినగర్ ఎస్‌బీఐ బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ... బీజేపీ 2017లో ఎన్నికల బాండ్ల వ్యవస్థను ప్రవేశపెట్టి, వేలకోట్ల రూపాయలను అక్రమంగా తమ ఖాతాల్లోకి వేసుకుందని తెలిపారు. విశ్వసనీయత, పారదర్శకత గురించి మాట్లాడే బీజేపీ నాయకులు ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఇంతవరకూ స్పందించక పోవడం వారి మోసకారి వైఖరికి నిదర్శనమ న్నారు. ఎన్నికల బాండ్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదమని సీపీఎం సుప్రీం కోర్టులో ఫిర్యాదు చేసిందని, దాని ఫలితంగా గత ఫిబ్రవరిలో తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్లను తక్షణమే రద్దు చేయాలని, మార్చి 6వ తేదీ లోపు ఈ బాండ్ల కొనుగోలు చేసినవారి వివరాలందించాలని, మార్చి 13వ తేదీ నాటికి ఏయే పార్టీకి ఎంతమొత్తంలో ఈ బాండ్లు అందాయో ఆన్‌లైన్‌లో ఉంచాలని ఎన్నికల సంఘానికి ఈ తీర్పులో సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. అయితే తీర్పును అమలు చేయకుండా జూన్ 30వ తేదీ వరకు గడువు కావాలని ఎస్‌బీఐ ద్వారా కోర్టులో పిటిషన్ వేయించడం వెనుక బీజేపీ హస్తం ఉందన్నారు. ఎన్నికల బాండ్ల వల్ల అత్యధికంగా లాభపడింది బీజేపీనేనని, ఈ వివరాలు బయటకు వస్తే ఎన్నికల ముందు తన నిజస్వరూపం బట్టబయలవుతుందని బీజేపీ భయపడుతోందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల నుంచి వేలకోట్లు పొందిన బీజేపీ దానికి ప్రతిఫలంగా దేశంలోని అనేక ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా వారికి అప్పగించిందని పేర్కొన్నారు. అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడం వెనుక ఈ అక్రమ డబ్బు ప్రభావం ఉందన్నారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి, ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌బీఐ ఏజీఎం కోటిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, నగర కార్యదర్శి రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఇర్ఫాన్, ప్రకాష్, సురేష్, పోతులయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఏజీఎం కోటిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



ఖాళీగా ఉన్న కుర్చీలు



వైద్యుల కోసం వేచి ఉన్న రోగులు



ఓపీ చీటీల కోసం ఉన్న రోగులు

వేళకు రాని వైద్యులు

ఉరవకొండ ఆస్పత్రిలో ఖాళీ కుర్చీలు

ఉరవకొండ, మార్చి 11: పట్టణంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యులు 10 గంటలైనా రాకపోవడంతో సోమవారం కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఏడుగురు వైద్యులు ఉన్నా ఒక్కరూ కూడా హాజరు కాలేదు. ఆసుపత్రికి రోజూ నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు కణేకల్లు, బెళుగుప్ప మండలాల నుంచి వైద్యం కోసం వస్తూ ఉంటారు. ఓపీ రోజూ 350 నుంచి 400దాకా ఉంటుంది. ఎంతో పేదలు వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ ఇక్కడకు వస్తుంటారు. అయితే వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థిక స్తోమత లేని రోగులు ఆస్పత్రి వద్ద పడిగాపులు కాస్తున్నారు. వైద్యులు విధులకు హాజరు కాకపోవడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లోజీని వివరణ కోరగా విధులకు వచ్చారని, పక్క గదిలో ఉన్నారని తెలిపారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

బొమ్మనహాళ్, మార్చి 11: మండలంలోని గోవిందవాడ గ్రామంలో యణ్డేరంగనాథేశ్వరస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ప్రారంభించారు. ఈ పోటీలలో ఏడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్ప ఎద్దులు సొంతం చేసుకున్నాయి. చెన్నప్పకు చెందిన మరో జత ఎద్దులు రెండో బహుమతి కూడా గెలుచుకున్నాయి. కంబదూరు మండలం కుర్లపల్లి గ్రామానికి చెందిన అక్కమ్మ ఎద్దులు మూడో బహుమతి దక్కించుకున్నాయి. బహుమతులను టీడీపీ నాయకులు సోమనాథ్ గౌడ్, హెచ్‌జీ వన్నూరు స్వామి, కటంబ్లి సుంకన్న, జగదీష్ ఆచారి, చెవులు వన్నూరు స్వామి అందించారు. కార్యక్రమంలో ముల్లంగి నారాయణ స్వామి, కే అరుణ్‌కుమార్, సోమనాథ్‌గౌడ్, వన్నూరు స్వామి, సుంకన్న, బంగి లోకేష్, నటరాజ్, వన్నేష్, మున్నా, రవిచంద్రసాగర్, గోనేహాళ్ రమేష్, కావలి రవి, ఐటీడీపీ అధ్యక్షులు కుమార్, సొంటి వన్నూరుస్వామి, మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప పాల్గొన్నారు.



రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న కాలవ భరత్

బాలికా విద్యను ప్రోత్సహించాం: కాలవ



విద్యార్థులతో కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 11: అత్యంత వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ పాలనలో బాలికా విద్యను ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజ్‌లో భాగంగా చదువుల ఒడిపై సోమవారం ఆయన 48వ వీడియోను విడుదల చేశారు. 2016-19 మధ్యన మూడేళ్ల పాటు 1426 మంది బడి మానేసిన బాలికలను గుర్తించి, వారిని బడుల్లో చేర్పించామన్నారు. జగన్ మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం పెట్టక ముందే తాను చదువుల ఒడి పేరుతో బాలికలకు చదువులు చెప్పించే కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న బాలికలను ఇంటర్మీడియేట్, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేర్పించడంతో పాటు వారి ఫీజులను తామే భరించామని తెలిపారు. వెనుకబడిన రాయదుర్గంలో చిన్న వయస్సులోనే బాలికల కూలికి వెళ్లడం, వ్యవసాయ పనులు చేయడంతో వారి జీవితాలు దుర్భరంగా మారతాయనే ఉద్దేశ్యంతో బాలికల విద్య వ్యాప్తికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. చదువుల ఒడి కార్యక్రమం ద్వారా చదువులు కొనసాగించిన వారిలో పలువురు వివిధ ఉద్యోగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఆర్డీఓ రామారావు, ఎమ్మార్వో కతిజిన్‌కుబ్రాలు ఎంతో చురుకుగా పనిచేశారన్నారు. అప్పట్లో విద్యాశాఖ మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావును రాయదుర్గానికి పిలిపించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించా మన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రస్తుతం విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాడని, రేషనలైజేషన్ పేరుతో స్కూళ్లను మూసేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. సంస్కరణల పేరుతో చేస్తున్న వికృత చేష్టల వల్ల చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని కాలవ ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ చంద్రబాబు ముఖ్య మంత్రి అయితేనే విద్యారంగానికి మంచిరోజులు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

అశ్వవాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు



తాడిపత్రిటౌన్, మార్చి11: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు అశ్వవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

రెండు గ్రామాల్లో బాబు ష్యూరిటీ

బెళుగుప్ప, మార్చి 11: బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయులు యలగలవంకలో విక్రమ్ సింహా, నరసాపురంలో జయసింహ సోమవారం విస్తృత ప్రచారం చేపట్టారు. రెండు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ వచ్చే ఎన్నికలలో సైకిల్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, జనసేన నాయకులు స్థానిక టీడీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా మద్దానేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



రథం లాగుతున్న భక్తులు ఇన్‌సెట్‌లో అలంకరణలో మద్దానేశ్వరస్వామి

రాయదుర్గంరూరల్, మార్చి 11: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామివారికి గంగపూజ, బిల్వార్చన, పుష్పలంకరణ, వస్త్రలంకరణ, వెండి కవచధారణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ప్రతిమను రథంలో ఉంచి ఆలయం నుంచి పాదగట్ట వరకు లాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

యల్లనూరు, మార్చి11: మండలంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉరవకొండ ఏడీఏ మాధవి ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లోని స్టాక్‌ను, అమ్మకాలను పరిశీలించారు. రిజిస్టర్ ప్రకారం ఉన్న వివరాలను గోడౌన్‌లో ఉన్న ఎరువుల బస్తాలను పరిశీలించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు

ఉరవకొండ, మార్చి11: రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. పట్టణంలో కాంగ్రెస్, వామపక్షాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు మండలాలు ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రైతుల అన్ని రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా పనులను చేపట్టి ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నారు. జగన్ సిద్ధం సభల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామానాయుడు, శ్రీనివాసులు, అబ్బాస్, ఓబులేసు, బ్యాళ్ల ప్రసాద్, పోసా రాము, వామపక్ష పార్టీ నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, జ్ఞానమూర్తి, చెన్నరాయుడు, సిద్దప్ప పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి: అమిలినేని



సురేంద్రబాబును సన్మానిస్తున్న మైనార్టీలు

కళ్యాణదుర్గం, మార్చి 11: టీడీపీతోనే మైనార్టీలు అభివృద్ధి చెందుతారని, ఆ దిశగా ప్రతి ఒక్కరు టీడీపీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కోరారు. సోమవారం ప్రజా వేదిక వద్ద పట్టణానికి చెందిన పలువురు మైనార్టీలు అమిలినేని సురేంద్రబాబును కలిశారు. పూల మాలలు, శాలువాలతో ఘనంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే పట్టణంలోని మైనార్టీల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సురేంద్రబాబు గెలుపే ధ్యేయంగా పని చేస్తాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు విజయమే ధ్యేయంగా పని చేస్తామని కళ్యాణదుర్గం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, ప్రధాన కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్‌జీ శివశంకర్‌ను అమిలినేని సురేంద్రబాబు కలిశారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఈ రోజు ఏ గ్రామంలో చూసినా టీడీపీ వైపే ప్రజల మొగ్గు కనిపిస్తోందన్నారు. ప్రజాభిమానంతో టీడీపీ విజయం తథ్యమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించడంలో మనమందరం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. భేదాభిప్రాయాలు లేకుండా కలిసికట్టుగా పని చేస్తే ఈ ఎన్నికల్లో 50 వేల పైబడి మెజార్టీ సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జీ శివశంకర్‌ను కలిసిన అమిలినేని సురేంద్రబాబు

శింగనమల రాజకీయాల్లో తలదూర్చను : జేసీపీఆర్



తాడిపత్రిటౌన్, మార్చి11: శింగనమల నియోజకవర్గ రాజకీయాల్లో తాను తలదూర్చనని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక నివాసంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన బండారు శ్రావణి తాను చెప్పినట్లు వింటుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఒకరు చెబితే వినే స్థాయి లో ఎవరూ లేరని, అదంతా అపోహ అని తెలిపారు. పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకే కార్యక్రమాలకు వెళ్లానే తప్ప రాజకీయం చేయడానికి కాదని తెలిపారు. కానీ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవడానికి అందరూ కలిసికట్టుగా శ్రమించాలని హితవు పలికారు. నాకు ఏ సాయం చేయాల్సిన అవసరం లేదని నా నుంచి ఏమైనా సహాయం కావాలంటే నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాకపోతే చాలామంది నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకొని టూమెన్ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అలకలు మాని కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె

కళ్యాణదుర్గం, మార్చి 11: శ్రీరామిరెడ్డి కార్మికులు మరోసారి సమ్మెలోకి వెళ్లారు. సోమవారం తాళాలు వేసి పంపుహౌస్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫేస్-4 కింద కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పనిచేస్తున్న 138 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె ప్రభావంతో సుమారు 198 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో గ్రామాల్లో నీటి కోసం అల్లాడిపోతున్నారు. గత 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. 5 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమ్మె చేసినప్పుడు హడావుడిగా రావడం, ఏదో ఒక హామీ ఇవ్వడం, తూతుమంత్రంగా ఒకనెలో, రెండు నెలలో జీతాలు మంజూరు చేసి వెళ్లిపోతారు. ఆ తర్వాత ఈ వైపు కూడా కన్నెత్తి చూడరని విమర్శించారు. మరలా మా బాధలు తెలుపుకునేందుకు ఇలా ఆందోళన చేయక తప్పడం లేదని వాపోయారు. మా జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు వెంటనే కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



శ్రీరామిరెడ్డి పంపుహౌస్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

రాష్ట్రస్థాయిలో యాడికి విద్యార్థి ప్రతిభ

యాడికి, మార్చి11: వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కాంపిటీషన్‌లో యాడికికి చెందిన వెంకట్ అనే విద్యార్థి మూడో బహుమతి అందుకున్నాడు. వెంకట్ యాడికిలోని సాయితేజ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్‌లో మంచి ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కరస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

భారీకాన్వాయ్‌తో వచ్చిన జేసీ పవన్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి11: శంఖారావం సభకు వస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు భారీ కాన్వాయ్‌తో టీడీపీ నాయకులు జేసీ పవన్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతపురం నుంచి వందల వాహనాల్లో అనుచరులు, కార్యకర్తలతో కలిసి లోకేశ్ వెంబడి తాడిపత్రిలోని సభా స్థలికి చేరుకున్నారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి

గుత్తిరూరల్, మార్చి 11: మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వేణు గోపాల్‌నాయుడు(37) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సుధాకర్ నాయుడు, కెపి నాగరాజు, చంద్రశేఖర్ నాయుడు, అంజి, శివరాజు, పూలమాలు వేసి నివాళులు అర్పించారు.

బొలెరో ఢీకొని ఒకరి మృతి

తాడిపత్రిటౌన్, మార్చి11: మండలంలోని బొందలదిన్నె గ్రామ సమీపంలో సోమవారం బొలెరో ఢీకొన్న సంఘటనలో చెన్నయ్య (33) మృతిచెందగా పుష్పలత గాయపడ్డారని రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని చిన్నపొలమడ గ్రామానికి చెందిన చెన్నయ్య విద్యుత్ బిల్లులు కొట్టే కార్మికునిగా పనిచేసేవాడు. చీరలు విక్రయించడానికి భార్యభర్తలు అయిన చెన్నయ్య, పుష్పలతలు ద్విచక్రవాహనంపై బొందలదిన్నె గ్రామానికి వెళుతుండగా వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ఢీకొటింది. చెన్నయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య పుష్పలతకు గాయాలయ్యాయి. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పేకాట మంత్రికి సీటివ్వొద్దు

గుంతకల్లు, మార్చి11: పేకాట, కబ్జాల, దందాల మంత్రిగా పేరుపొందిన గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు ఎమ్మెల్యే టిక్కెట్‌ను కేటాయించరాదని టీడీపీ లీగల్ సెల్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, హేమాద్రి, ఎన్ఎల్ ప్రసాద్, రాజశేఖర్ మాట్లాడుతూ గుమ్మనూరు జయరాంకు ఎక్కడ టిక్కెట్టు ఇస్తారో, గుంతకల్లు దౌర్జన్యాలకు నిలయంగా మారుతుందేమోనన్న భయం ప్రజల్లో ఉందన్నారు. పాదయాత్ర సందర్భంగా లోకేశ్‌ను, చంద్రబాబు నాయుడును గుమ్మనూరు జయరాం ఎంతగానో దుర్భాషలాడారన్నారు. అటువంటి జయరాంకు గుంతకల్లు టిక్కెట్టిస్తే కార్యకర్తలు, నాయకుల మనోభావాలు దెబ్బంతింటాయన్నారు.

హై వోల్టేజ్‌తో కాలిపోయిన మోటార్లు

కూడేరు, మార్చి 11: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. పంటలకు నీటిని అందించేందుకు విద్యుత్ సరఫరా జరుగుతున్న సమయంలో కరెంట్ హై వోల్టేజ్‌తో రావడంతో ఇటీవల వ్యవసాయ మో టార్లు వందకు పైగా కాలిపోయినట్లు రైతులు తెలిపారు. మరుట్ల సబ్ స్టేషన్ నుంచి మరుట్ల, కల్లగళ్ల, పి. నాగిరెడ్డిపల్లి గ్రామాల సమీపంలోని తోటలకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. విద్యుత్ సరఫరా చేసిన వెంటనే వ్యవసాయ మోటర్లు ఆటోమేటిక్‌గా ఆన్ అవుతాయి. త్రీ ఫేస్ కరెంటు వదిలిన సమయంలో హై వోల్టేజ్‌తో విద్యుత్ సరఫరా కావడంతో దాదాపు వందకు పైగా మోటార్లు కాలిపోవడంతో అన్నదాతలు ఉలిక్కిపడ్డారు. ఒక్కొక్క రైతుకు దాదాపు పది వేలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.

ఇరువర్గాల ఘర్షణ

ఉరవకొండ,మార్చి11: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఇరువర్గాలు ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డాయి. పాత కక్షల నేపథ్యంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలు గొడవపడ్డారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 17మంది మీద కేసు నమోదు చేశారు. దీంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. త మ ఫిర్యాదును తీసుకోవాలని ఎస్ఐ రాఘవేంద్రతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది, ఫిర్యాదు తీసుకుంటామని ఎస్ఐ తెలపడంతో వారు స్టేషన్ నుంచి పక్కకు వెళ్లిపోయారు. ఫిర్యాదుపై విచారిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థినులకు ఫిట్నెస్ రన్

గుంతకల్లుటౌన్, మార్చి11: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీశైలభ్రమరాంబిక డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు ఫిట్నెస్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం, నెహ్రూయువ కేంద్రం, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటి ఆధ్వర్యంలో ఫిట్నెస్ రన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వసుంధర, ఎన్ఎస్ఎస్ రాష్ట్ర ఉత్తమ వలంటీర్ అవార్డు గ్రహీత నందిత మాట్లాడుతూ మహిళలు చదువుల్లో రాణించాలన్నారు. అనంతరం ఫిట్నెస్‌లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలోఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు యస్ మంజుల, స్వప్న, వాలంటర్స్ సాకేరాజు, ధోని, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న సొసైటీ సభ్యులు

వైసీపీని సాగనంపే రోజులు దగ్గరపడ్డాయి



తరలివెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

యాడికి, మార్చి11: రాష్ట్రం నుంచి వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యాడికి, రాయలచెరువులో తెలుగు తమ్ముళ్లు పెద్దఎత్తున తాడిపత్రిలో నిర్వహించే శంఖారావం సభకు సోమవారం తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని వారు తెలిపారు. తరలివెళ్లిన వారిలో మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్, కులశేఖర్‌నాయుడు, మదమంచి శివ, ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, రూపునేని రాజశేఖర్, శోభన్‌బాబు, విక్రమ్, లక్ష్మణ్, నారా యణస్వామి, విశ్వనాథ్, మల్లికార్జున, రహంతుల్లా ఉన్నారు.

పుట్లూరు: తాడిపత్రిలో టీడీపీ నిర్వహించిన శంఖారావం సభకు సోమవారం మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే బడుగుబలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. తరలివెళ్లిన వారిలో టీడీపీ నాయకులు పుట్లూరు పుల్లారెడ్డి, చెన్నారెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, రంగయ్య, రామాంజనేయులు, రామాంజి, నరసింహ ఉన్నారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయక్

కళ్యాణదుర్గం, మార్చి 11: విద్యార్థి దశలోనే కష్టపడేతత్వాన్ని అలవర్చుకుంటే జీవితంలో విజయాలు సాధిస్తారని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. సోమవారం కంబదూరులో ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్యను విద్యార్థి దశలోనే నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బాగా చదివించాలన్నారు. చదువుతోనే ఏదైనా సాధించవచ్చునని అన్నారు. ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా జీవితంలో ముందడుగు వేస్తే, జీవితంలో విజయాలు సులువుగా పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయలక్ష్మీ, ఐఈడీఎస్ఎస్ చిన్న మల్లప్ప, టీచర్ లక్ష్మీ, ఐఆర్‌పీలు దేవి జై కృప, అరుణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



గంగాధర కుమారుడిని పరామర్శిస్తున్న యశ్వంత్

కుందుర్పి, మార్చి 11: మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి కుటుంబానికి అమిలినేని సురేంద్రబాబు తనయుడు యశ్వంత్ ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర కుమారుడు మౌర్య అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. పది వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సురేంద్ర బాబు అల్లుడు నవీన్, స్థానిక నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, ఈరన్న పాల్గొన్నారు.

డ్రైఫ్రూట్స్ తినిపోతే చాలా..?

అధికారుల తీరుపై వైసీపీ కౌన్సిలర్ల అసహనం

రాయదుర్గం, మార్చి 11: కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు డ్రైఫ్రూట్స్ తిని సంతకాలు పెట్టి పోతే చాలు అనే పరిస్థితిలో అధికారులు ఉన్నారని వైసీపీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్ ప్రశాంతి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎన్నోసార్లు దీనిపై చెప్పినా పట్టించుకునే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. గ్రీన్ టాయిలెట్ల నిర్మాణానికి నిధులు కేటాయించి నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం నిర్మాణాలు పూర్తి చేయలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న వైసీపీ కౌన్సిలర్లు జోక్యం చేసుకొని డ్రైఫ్రూట్స్ తిని మీటింగ్‌లో సంతకాలు పెట్టించుకుంటే చాలనే పరిస్థితిలో అధికారులు ఉన్నారని, అందుకు మాత్రమే పనికొచ్చే పరిస్థితి నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి మీటింగ్‌లో సమస్యలు ఏకరువు పెడుతున్నా పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. విద్యుత్ వీధి లైట్ల సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. దీనిపై కమిషనర్ కిశోర్ సమాధానమిస్తూ అత్యవసరమైన చోట్ల మాత్రమే వీధిలైట్లు వేస్తున్నామని, తాగునీటి సమస్య విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

రూ. 31.10 లక్షలకు దినసరి మార్కెట్ వేలం

రాయదుర్గం, మార్చి 11: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన దినసరి మార్కెట్‌వేలం పాటను అరవింద్ రూ. 31.10 లక్షలకు దక్కించుకున్నాడు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దినసరి మార్కెట్ వసూళ్ల కోసం నిర్వహించిన వేలంపాటలో 20 మంది దాకా పాల్గొని పోటీ పడ్డారు. చివరకు అరవింద్‌కు దక్కినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

రాయదుర్గం రూరల్, మార్చి 11: మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద అనంతపురం జాతీయ రహదారి సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి రామ్‌చరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. కెంచానపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి ద్విచక్రవాహనంపై రాయదుర్గం నుండి తన స్వగ్రామానికి వెళ్తుండగా ఉడేగోళం గ్రామంలో రోడ్డు దాటుతున్న రామ్‌చరణ్‌ను ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన రామ్‌చరణ్‌ను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.